## క్లుప్తంగా

### పెద్దమ్మవ్వ ఆలయాభివృద్ధికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం



కైరుప్పలలో గ్రామ పెద్దలకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వెలసిన పెద్దమ్మవ్వ ఆలయాభివృద్ధికి సోమవారం ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి రూ. లక్ష విరాళం అందజేశారు. అనంతరం పెద్దమ్మవ్వ తోపాటు వీరభద్రస్వామి, కాళికాదేవిల ఆలయాలలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మక్క, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకులు కృష్ణమోహన్, గోవర్ధన్, సుంకుర రామాంజినేయులు, దత్తాత్రేయరెడ్డి, అశోక్, వెంకటేష్, ప్రకాష్, వీరభద్రి, లక్ష్మన్న, రాజన్నగౌడ్, రంగన్న, కొలుట్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### నరసప్పస్వామికి వెండిముఖం విరాళం



వెండి ముఖాన్ని అందజేస్తున్న దాతలు

మద్దికెర : స్థానిక నాయీబ్రాహ్మణ వీధిలో ఉన్న నరసప్ప దేవాలయంలో కొలువైన నరసప్ప స్వామి వారికి స్థానిక భక్తులు మంగళ గిడ్డయ్య, సుంకమ్మ కుమారులు వెంకట్రాముడు, నాగరాజు, ఓబులేసు రూ. 50 వేలు విలువ చేసే వెండి ముఖాన్ని విరాళంగా సోమవారం అందజేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూజలకు విచ్చేయసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిమ్మయ్య, రామకృష్ణ, సోము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సమారాధన

ఆస్పరి: ఆస్పరిలో సోమవారం జనార్ధన స్వామి సమారాధన పూజలు ఘనంగా జరిగాయి. కార్తీక మాసం అనంతరం మరుసటి రోజు స్వామి సమారాధన పూజలు నిర్వహించడం ఆనవాయతీ. పూజారి నరసింహయ్య స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి గంగ, ఆకుపూజ, మంగళహారతులు తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### నేడు తుగ్గలిలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

తుగ్గలి : సెక్రైడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలను మంగళవారం తుగ్గలిలో నిర్వహిస్తున్నట్లు వెన్నెల మండల దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి సోమవారం తెలిపారు. ఉదయం 10.30 ర్యాలీ అనంతరం సెక్రైడ్ కార్యాలయంలో సమావేశం ఉంటాయన్నారు. కార్యక్రమంలో తుగ్గలి, మద్దికెర మండలాల దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**4న పత్తికొండలో..**

సిద్ధార్థ దివ్యాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం పత్తికొండ ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు.

### 7న పాఠశాలల్లో పేరెంట్- టీచర్ మీటింగ్

పత్తికొండ(తుగ్గలి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7న పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ-2 రమేష్ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల మధ్య బలమైన అనుబంధం ఏర్పరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెంపు, వారి నడవడిక, ఉన్నతికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుని, వారిని ఉజ్వల భవిష్యత్ వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు తెలిపారు.

### ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దికెర : ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు వీలుంటుందని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్ అన్నారు. సోమవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ప్రోత్సహించడమే గాకుండా వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా వుంటారన్నారు. క్రిమిసంహారక మందులు వాడిన కూరగాయలు తినడం వల్ల రోగాల బారిన పడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

# ధాన్యం..దైన్యం

- పెరిగిన వరి దిగుబడి.. తగ్గిన ధర
- గతేడాదితో పోలిస్తే రూ.వెయ్యి వరకు తగ్గింపు
- అయినా కొనేవారు కరువు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం

హొళగుంద: వరి దిగుబడి బాగున్నా పెట్టుబడులు పెరగడం, ధాన్యాన్ని కొనేవారు లేకపోవడంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తెగుళ్లు, అధిక వర్షాలతో ఇప్పటికే ఖర్చులు పెరిగి నష్టపోయారు. ఇన్నాళ్లు నిలకడగా ఉన్న ధర పంట చేతికి రాగానే అమాతం తగ్గింది. అయినా కొనేవారు లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

**ఆశాజనకంగా దిగుబడి**

మండలంలో ఎల్లెల్సీ కింద దాదాపు 5 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. నెల రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న ధాన్యం ధర ఇప్పుడు అమాంతంగా పడి పోయింది. దీంతో రైతులు నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం ధాన్యాన్ని కొనడానికి వ్యాపారులు వెంట పడేవారు. అయితే ఈ ఏడాది రైతులే పంటను అమ్ముకోవడానికి వారి వెంట పడాల్సి వస్తోంది. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎకరాకు 12 పుంచి 14 బస్తాల వరకు కౌలు ఇచ్చి, రూ.35 వేలకు పైగానే ఖర్చు పెట్టారు. కౌలు చెల్లించి గట్టెక్కినా పంట అమ్మిన వచ్చిన డబ్బంతా పెట్టుబడులకు పోనూ అప్పులే మిగిలాయి. దీంతో అప్పులు తీర్చేందుకు రైతులు కూడా కూలీలతో కలిసి పల్లెలను వదిలి వలస పోవడానికి సిద్ధమవుతున్నారు.

**పెరిగిన పెట్టుబడులు**

వరి పంట కంకి దశకు చేరుకుంటున్న సమయంలో తెగుళ్ల బెడదతో అధికంగా రసాయనిక మందులు వాడడం, నేలకొరిగిన పంటల రక్షణకు అదనపు ఖర్చులు పెట్టాల్సి వచ్చింది. అయితే పంట చేతికి రాగానే ధర తగ్గడం మొదలైంది. వ్యాపారుల సిండికేట్ ఇందుకు కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. అయినా ధాన్యాన్ని కొనేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో రైతులే వ్యాపారస్తులకు బలవంతం మీద ధాన్యాన్ని ఇస్తుండడంతో వారు తక్కువ రేటుకే అడుగుతున్నారు.

**వణికిస్తున్న తుపాను**

తుంగభద్ర దిగువ కాలువ( ఎల్లెల్సీ) కింద సాగు చేసిన వరి పంట కోతలు జరగుతున్నాయి. ఈ తరుణంలో తుపాను కారణంగా కురుస్తున్న తేలిక పాటి వర్షానికి, గాలికి పైరు నెలకొరిగి గింజలు నేల పాలయ్యాయి. జల్లులు కురుస్తుండటంతో ఇప్పటికే కోతలు చేసి పొలాల్లో, రైస్‌మిల్‌లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను రైతులు తార్పిలిన్లతో కప్పి కాపాడుకుంటున్నారు.

**ఆదుకోని ప్రభుత్వం**

ఇన్ని కష్టాలను దాటి పంటను పండిస్తే దాన్ని అమ్ముకునేందుకు సమస్యగా మారింది. వరికి మద్దతు ధర ప్రకటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మండల రైతులు పొరుగున ఉన్న కర్ణాటకలో పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే అక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారు. ఇలాంటి సమయంలో ఎగుమతి లేదనే సాకుతో ధాన్యాన్ని కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



రైస్ మిల్లులో ధాన్యాన్ని అరబెట్టిన దృశ్యం

ప్రభుత్వమే మద్దతు ధరను ప్రకటించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



పొలాల్లో ధాన్యాన్ని అరబోసిన దృశ్యం

| వరి రకం | ప్రస్తుత ధర (క్వింటా) | గతేడాది ధర(క్వింటా) |
| --- | --- | --- |
| సోనా మసూరి | రూ.2,000 | రూ.2,800 నుంచి 3,200 |
| ఆర్ఎన్ఆర్ | రూ.2,150 | రూ.3,300 |
| 1638 రకం | రూ. 1,700 | రూ. 2,600 |

### రైతులు బతికేదెలా?



ఖరీఫ్‌లో 8 ఎకరాల పొలంలో వరి పంటలను సాగు చేశా. దాదాపు రూ.2 లక్షలకు పైగా అప్పుల చేసి పెట్టుబడులు పెట్టాను. ప్రతీది రేటు పెరిగినా పంట మాత్రం అనుకూల రీతిలో దిగుబడి వచ్చింది. అయితే కొనే వారు ముందుకు రాకపోవడం మరో సమస్యగా మారింది. దీంతో పంటకు ధరలేక, పెట్టుబడులు రాక అప్పులు తీర్చడం కష్టతరంగా మారింది. ఇక మాలాంటి రైతులకు ఆత్మహత్యలే శరణ్యం.

– పింజరి బాషా, రైతు, హొళగుంద

### ధాన్యం కొనేవారు కరువు



రాత్రి పగలు కష్ట పడి పండించిన ధాన్యాన్ని కొనే నాథుడే లేడు. ఒకవేళ కొంటానని అంటున్నా వ్యాపారులు అందుకు సవాలక్ష షరతులు పెడుతున్నారు. అదిగాకా డబ్బులు ఇవ్వడానికి నెలలు గడువు అడుగుతున్నారు. మూడెకరాలకుగాను వంద బస్తాల వరకు దిగుబడి రావచ్చు. ధాన్యాన్ని అమ్ముకునెందుకు వ్యాపారస్తుల వెంట పడుతూ ఇబ్బందులు పడ్తున్నాం. ధాన్యాన్ని కల్లంలోనే ఉంచుకుంటున్నాం.

– హచ్చొళ్లి ముదుక, రైతు, హొళగుంద

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకోవాలి. ఎన్నడూ లేని విదంగా ఈ సారి పురుగు మందులకు వేల రూపాయలు ఖర్చయ్యాయి. రైతులకు చివరికి అప్పులే మిగిలాయి. అప్పులను ఎలా తీర్చాలో అర్థం కాక ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో రైతులను ఆదుకోవాలి.

– కెంచప్ప, రైతు, గజ్జహళ్లి

### భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

హొళగుంద: మండల కేంద్రం హొళగుందలో వెలిసిన వీరభద్రేశ్వరస్వామి, దక్షిణమూర్తి ఆలయాల్లో కార్తీక మాసం సోమవారాన్ని పురస్కరించుకుని దీపోత్సవం వైభవంగ జరిగింది. ఆయా ఆలయాలలో స్వామివారికి పూజారులు అభిషేకలు, మహామంగళారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణాలలో వివిధ ఆకారాలలో భక్తులు దీపాలు వెలిగించారు. భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



దక్షిణమూర్తి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

### వాటర్ ప్లాంట్ నిర్వహణకు వేలం

పత్తికొండ(తుగ్గలి) : మండల పరిధిలోని దేవనబండలో ప్రభుత్వ వాటర్ ప్లాంట్ నిర్వహణకు సోమవారం డీఎల్‌పీఓ వీరభద్రప్ప, సర్పంచ్ పి. ప్రవీణ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటలో వీరన్న అనే వ్యక్తి రూ.3లక్షలకు నిర్వహణ హక్కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, నాయకుడు గాంధీరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

పత్తికొండ(తుగ్గలి): డివిజన్ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పత్తికొండ ఆర్డీఓ డాక్టర్ ఎస్ భరత్‌నాయక్ ఆదేశించారు. సోమవారం పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికల నిర్వహణపై నీటి వనరుల శాఖ, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాగునీటి సంఘాలకు సంబంధించి ఈనెల 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించి 5న ప్రకటన వెలువడనుందని, 8న ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. ఇందులో నామినేషన్ల స్వకరణ, ఆరుగురు ప్రాదేశిక సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నిక రోజు ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ డీఈ ఎస్ జిలాన్‌బాషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎస్ భరత్‌నాయక్

### పంట నమోదు చేయించాలి

మద్దికెర : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు పప్పు శనగ, వాము, జొన్న సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఏఓ రవి సూచించా రు. సోమవారం మద్దికెర పరిసరాలలో పంట నమో దు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతలు తప్పనిసరిగా పంటల నమోదుకు వ్యవసాయాధికారులకు సహకరించాలన్నా రు. తమ పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్ జిరాక్స్ ప్రతులను సమీపంలోని రైతు సేవా కేంద్రాలలో అందజేయాలన్నారు. అలాగే పంటలు సాగు చేసిన ప్రతి ఒక్కరూ మీసేవలో డిసెంబర్ 15 లోగా తమ వివరాలతో ప్రధానమంత్రి పంట బీమా పథకం కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భోజరాజు, వ్యవసాయ సహాయకులు జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ రవి


తుగ్గలి : రబీలో సాగు చేసిన ప్రతి పంటను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. సోమవారం తుగ్గలిలో రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. సాగుచేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్, ఎంపీఈవో స్రవంతి, వీఏఏ లోహిత్ పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా జీసీడీఓ హేమలత

ఆలూరు రూరల్: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కర్నూలు జిల్లా మహిళా,శిశు సంరక్షణ అభివృద్ధి అధికారి హేమలత కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు సూచించారు. సోమవారం ఆమె ఆలూరులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. గదులు, వంటశాలతో పాటు పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది పరీక్షలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సాయంత్రం స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు వచ్చేలా బోధించాలన్నారు. మెను ప్రకారం భోజనం వడ్డించాలని ఎస్ఓ సుహాసనికి సూచించారు.

**విద్యార్థులకు బాక్సింగ్ కిట్ అందజేత**



పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న హేమలత

కేజీబీవీ పాఠశాలలో బాక్సింగ్ సాధన చేయడానికి విద్యార్థిని అశ్విత తల్లిదండ్రులు వీరేష్, నరసమ్మ బాక్సింగ్ కిట్ అందజేశారు. ఈ మేరకు జీసీడీఓ హేమలత, ఎస్ఓ సుహాసినికి ఒక బాక్సింగ్ కిట్, 10 టీషర్టులు అందజేశారు. పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి అశ్విత, శిరీష ఇటీవలే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అశ్విత తల్లిదండ్రులకు ఎస్ఓ కృతజ్ఞతలు తెలిపారు.

## మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

ఆలూరు రూరల్: మాదక ద్రవ్యాల వాడకంతో భవిష్యత్ అంధకారమవుతుందని ఎస్ఐ దిలీప్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల అరికెరలో మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే నష్టాలపై ప్రిన్సిపాల్ నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. సరదా కోసం మత్తు పదార్థాలకు అలవాటుపడితే అది వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు.




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ ప్రదీప్ కుమార్

# బాబు షూరిటీ..బాదుడు గ్యారంటీ

- ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని మభ్యపెట్టిన చంద్రబాబు
- గద్దెనెక్కాక రెండు సార్లు పెంచిన ఘనుడు
- ఆరు నెలల పాలనలో రూ.15 వేల కోట్లు ప్రజలపై భారం మోపిన కూటమి సర్కార్
- సూపర్ సిక్స్ అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్న సీఎం
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: బాబు షూరిటీ విద్యుత్ చార్జీల బాదుడు గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచబోమని మభ్యపెట్టి గద్దెనెక్కిన బాబు ఆరునెలల పాలనలో ఏకంగా రెండు సార్లు పెంచిన ఘనుడు అని ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి సర్కార్ పాలన తీరుపై మండిపడ్డారు. ప్రజలను మభ్యపెట్టి వంచించడం చంద్రబాబుకు కొత్తేమి కాదన్నారు. తాను మారిన మనిషిని...సూపర్ సిక్స్ పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తానంటూ మభ్యపెట్టి సీఎం అయిన బాబు విద్యుత్‌చార్జీలు పెంచి ప్రజలపై రూ.15.485 కోట్లు భారం మోపారని ధ్వజమెత్తారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో దీపావళి పండగ తర్వాత రూ.6 వేల కోట్లు, తాజాగా రూ.9వేల కోట్లు ప్రజల నెత్తిన భారం మోపిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవా చేశారు. జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు తక్కువకే విద్యుత్ కొనుగోలు చేయడమే కాకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ, రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతీ యూనిట్‌కు రూ.0.92 పైసలు భారం వేశారన్నారు. మొత్తంగా యూనిట్‌కు రూ.2.19 పైసలు వినియోగదారుడు అదనంగా చెల్లించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

**సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్**

సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేసిన చంద్రబాబు రాష్ట్రంలో ప్రజలకు ఏమార్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. అసమర్థ పాలనతో రాష్ట్రం సర్వనాశనం అవుతోందని, తప్పు జరిగితే ఎవరినైనా ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదన్నారు. పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్ అవుతున్నాయని పదేపదే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందని, ఎందుకు అరికట్టలేక పోతున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలవుతున్నా తల్లివందనం, ఫీజురియంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1,500 తదితర పథకాల ఊసేలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం విషయాన్ని పట్టించుకునే నాథుడు కరువయ్యారని విమర్శించారు. ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్న కూటమి సర్కార్‌కు త్వరలోనే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మండల కో-కన్వీనర్ వీరేష్, మాజీ ఎంపీటీసీ కిషోర్ బిణిగేరి సర్పంచ్ వెంకటేషులు నాయకులు అరికెర వెంకటేషులు, శివన్న, ఎల్లప్ప, గిరి,భాస్కర్,బాబు,మల్లికార్జున, శేఖర్,రాజు తదితులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి గ్రామ సమీపంలో సోమవారం ట్రాక్టర్‌ను తప్పించబోయి మోటార్ సైకిల్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ చంద్ర తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నాగరాజు, వీరేష్ బైకుపై కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఉన్న బంధువులకు పెళ్లి పత్రికలను పంచి తిరుగు ప్రయాణం అయ్యారు. క్షేత్రగుడి సమీపంలో ట్రాక్టర్ ఎదురుగా రావడంతో తప్పించేక్రమంలో మోటార్ సైకిల్ రోడ్డు కింద వైపు దూసుకెళ్లింది. నాగరాజుకు స్వల్ప గాయాలు కాగా, వీరేష్‌కు కాలు విరిగింది. ఎస్ఐ చంద్ర, స్థానికులు వెంటనే గాయపడిన వారిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థులపై ఒత్తిడి పెడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు టి. కృష్ణ డిమాండ్ చేశారు. వెల్దుర్తిలోని పద్మ విద్యా వికాస్ స్కూల్‌లో రెండవ తరగతి చదువుతున్న ఎల్. నగరం గ్రామానికి చెందిన తెలుగు ఎల్లా కృష్ణ స్కూల్‌కు వెళ్లమంటే సోమవారం ఇంట్లో పురుగు మందు తాగి మరణించడం బాధాకరమన్నారు. విద్యార్థి స్కూల్ పోవడానికి ఇబ్బంది పడుతున్నాడంటే పాఠశాల యాజమాన్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సుధీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలను అరికడదాం



హొళగుందలో ర్యాలీ నిర్వహిస్తున్న పొదుపు గ్రూపు మహిళలు, వెలుగు సిబ్బంది

హొళగుంద:బాల్య వివాహాలను అరికట్టడాన్ని ప్రతి ఒకరూ బాధ్యతగా తీసుకోవాలని వెలుగు సీసీలు హనుమంతు, రాధమ్మ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బాలిక సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీలు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం అనర్థాలకు దారితీస్తాయన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. అనంతరం పొదుపు మహిళలు ర్యాలీ నిర్వహించారు.

## ఘనంగా వీరభద్రస్వామి, కాళికాదేవి నిశ్చితార్థం

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవి నిశ్చితార్థ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం అరంతకం మొదటి సోమవారం వీరభద్రస్వామి, కాళికాదేవిల నిశ్చితార్థం జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. స్వామివారి నిశ్చితార్థం తిలకించేందుకు ఆస్పరి, కారుమంచి, వెంగళాయిదొడ్డి, చెన్నంపల్లి, పుష్పాలదొడ్డి, ములుగుందం, యాటకల్లు, తొగలుగల్లు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. పూజాచి శేఖర్ స్వామి ఆధ్వర్యంలో వీరభద్రస్వామి, కాళికాదేవికి గంగ, ఆకు పూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ఇరువర్గాలకు చెందిన పెద్దలు తాంబూలాలను మార్చుకున్నారు. పార్వతి, పరమేశ్వర్లు, వీరభద్రస్వామి, కాళికాదేవి ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో ఊరేగించారు. ఉగాది పండుగ రోజు స్వామి, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. ఉగాది పండుగ రోజు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భక్తులు ఇరువర్గాలుగా విడిపోయి పిడకల (నుగ్గులు) ఆట ఆడుతారు.



కైరుప్పలలో వీరభద్రస్వామి, కాళికాదేవిల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

### డ్రైనేజీ నీటిని తొలగించాలి

మద్దికెర: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో డ్రైనేజీ నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. హాస్టల్‌లో 250 మంది విద్యార్థులున్నారని, రోజూ స్నానం చేసిన నీరు వెళ్లేందుకు డ్రైనేజీ లేక ఆవరణలోనే నిలుస్తోందన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుర్వాసన వెదజల్లడమే గాకుండా దోమలు పెరిగి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉమామహేష్, రాకేష్, రాము పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

## మరో విద్యుత్ ఉద్యమం తప్పదు

ఆస్పరి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హెచ్చరించారు. ఆస్పరిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి సర్కార్ తీరును తప్పుపట్టారు. ఎన్నికల సమయంలో ఎలాంటి విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలపై భారం మోపడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీలకు అదనంగా యూనిట్‌కు రూ.2.92 రూపాయలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి, హనుమంతు, చంద్రశేఖర్, రామక్రిష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

హాలహర్వి:కూటమి ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజల కు ఇచ్చిన హామీ ప్రకారం పెంచిన విద్యు చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సీపీఐ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాలను అప్పటి ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు వ్యతిరేకించారని, నేడు అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే అదే విద్యుత్ చట్టాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాముడు, వన్నూరువలి, లింగప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య